https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 93 ఆదివారం 9-08-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.
సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# ప్రశ్నించడమే కాదు..
# పరిష్కారాలు వెతకండి

**సవాళ్ల నుంచి అవకాశాలను ఒడిసి పట్టండి**

**జెన్‌జీ తరం దేశంపట్ల బాధ్యతనూ నెరవేర్చాలి**

**నిత్యం నేర్చుకుంటేనే గెలుస్తారు**

**ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో మోదీ**



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** యువతరం ప్రతి సమస్య గురించి ప్రశ్నించటంతో ఆగకుండా.. ఆ సమస్యలకు పరిష్కారాలను కూడా వెదకాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. "ప్రతి తరానికీ దేశంపట్ల నిర్వహించాల్సిన బాధ్యతలుంటాయి. ప్రస్తుత యువత కూడా ఆ బాధ్యతలను నెరవేర్చాలి. దేశ సమగ్ర అభివృద్ధి సాధనను మీ లక్ష్యాల్లో భాగం చేసుకోండి. జెన్‌జీ తరం సామర్థ్యంపై నాకు పూర్తి నమ్మకం ఉంది. వికసిత భారత్ సాధనలో దేశానికి వారి అవసరం ఎంతో ఉంది" అన్నారు. ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ప్రధాని శనివారం మాట్లాడారు. 'విద్యా సంస్థ నుంచి డిగ్రీ పట్టా తీసుకొని బయటి ప్రపంచంలోకి వెళ్తున్న యువత ఇక నేర్చుకోవటం అయిపోయిందని అనుకోవద్దు. మరో 20–30 ఏళ్ల తర్వాత ప్రపంచం ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. అందువల్ల నిత్యం కొత్త విషయాలను నేర్చుకుంటూనే ఉండాలి. అప్పుడే విజేతలుగా నిలవగలరు' అని అన్నారు. కాక్రోచ్‌ల ఉద్యమం తర్వాత జెన్‌జీని ఉద్దేశించి బహిరంగ వేదిక నుంచి మోదీ మాట్లాడటం ఇదే తొలిసారి. విద్యార్థులనుద్దేశించి ప్రధాని సరదా వ్యాఖ్యలు చేశారు. "ఈ హాలులోని ప్రతి ఒక్కరిలో ఉత్సుకత కనిపిస్తోంది. కానీ, గ్రాడ్యుయేట్ల బుర్రల్లో వేరే ఏదో ఉంది. నేను బాబా భాగేశ్వర్‌ను కాను. కానీ, వారి బుర్రల్లో ఉన్నదాన్ని చెప్పగలను. తొలి జాబ్ ఆఫర్.. అందుకోబోయే వేతనానికి సంబంధించిన ప్రశ్నలు వారి మెదళ్లను తొలుస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు. అనంతరం అవార్డులకు ఎంపికయినవారికి బహుమతులు ప్రదానం చేశారు. విజేతల్లో విద్యార్థిని ఒకరిద్దరే ఉండటాన్ని ఈ సందర్భంగా మోదీ ప్రస్తావించారు. స్టెమ్ కోర్సుల్లో అమ్మాయిల భాగస్వామ్యం పెరగాలన్నారు.

**జెన్‌జీకి చేరువయ్యేందుకు స్నాప్‌చాట్‌లోకి విదేశాంగ శాఖ**

జెన్‌జీకి మరింత చేరువయ్యేందుకు కేంద్ర విదేశాంగ శాఖ (ఎంఈఏ) మరో ముందడుగు వేసింది. యువత ఎక్కువగా వినియోగించే సోషల్ మీడియా యాప్ అయిన 'స్నాప్‌చాట్'లో తాజాగా తన అధికారిక చానెల్‌ను ప్రారంభించింది. సోషల్ మీడియా వేదికగా యువతతో మమేకమవ్వాలని ప్రధాని మోదీ ఇటీవల కేంద్ర మంత్రులకు సూచించిన నేపథ్యంలో విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

# నిరుద్యోగులకు సర్కారు క్షమాపణ చెప్పాలి

**2 లక్షల ఉద్యోగాల హామీ బోగస్: హరీశ్**



**హైదరాబాద్, ఆగస్టు 8** ఉద్యోగాల కోసం వచ్చిన విద్యార్థులు, నిరుద్యోగ యువతపై అనుచితంగా, అసభ్యకరంగా వ్యాఖ్యలు చేసిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్‌చేశారు. వారి పట్ల అవమానకరంగామాట్లాడినందుకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని శనివారం ఓ టీవీ చానెల్‌తో మాట్లాడుతూ చెప్పారు. 'హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తే.. దరఖాస్తు చేసుకోవడానికి వేల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవడానికి తరలి రావడం వారి తప్పా? లేక ఉద్యోగాల కల్పనలో విఫలమైన ప్రభుత్వం తప్పా? ఈ ప్రభుత్వం ఎవరి కోసం పని చేస్తున్నట్టు?' అని ఆయన ప్రశ్నించారు. విద్యార్థులు, నిరుద్యోగులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకంత కక్ష అని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండులక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చిన సర్కారు 32నెలలు దాటినా అమలుకు నోచుకోలేదన్నారు. 'రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేల మంది నిరుద్యోగులు క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా?2 లక్షల ఉద్యోగాల హామీ ఒక బోగస్'అని ఎద్దేవా చేశారు. పీజీలు చేసిన యువత కూడా చిన్న పోస్టుల కోసం పోటీ పడడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

# నిరుద్యోగ భృతి ఊసెత్తని ప్రభుత్వం

**యువతకిచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలం..**

**ఉద్యోగావకాశాల కోసం వచ్చినవారిపై లాఠీచార్జీయా?**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**హైదరాబాద్, ఆగస్టు 8:** నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. 'జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపడతామని, ప్రతి నెలా నిరుద్యోగ భృతితో పాటు యువతకు అన్ని విధాలా అండగా ఉంటామని గొప్పలు చెప్పింది. కానీ రెండేళ్లు గడిచినా నేటికీ తెలంగాణ యువత ఉద్యోగాల కోసం రోడ్లపైనే నిరీక్షించాల్సి రావడం శోచనీయ'మని ఆయన పేర్కొన్నారు. సరూర్ నగర్ స్టేడియంలో హైడ్రా ఉద్యోగాల కోసం తరలివచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో యువత కోసం మొసలి కన్నీరు కారుస్తుంది.. తెలంగాణలో మాత్రం ఉపాధి కోసం వచ్చిన అమాయక నిరుద్యోగ యువతపైకి పోలీసులను ప్రయోగిస్తోంది. కాంగ్రెస్ చెప్పే 'మొహబ్బత్ కీ దుకాణ్' అంటే ఇదేనా?' అని ఆయన నిలదీశారు.

# 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం**



**హైద్రాబాద్, ఆగస్టు 8 :** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 15 నుంచి 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆ సమయంలోనే మిగిలిన 32 జిల్లా కేంద్రాల్లో కూడా పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇప్పటివరకు 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు ప్రభుత్వం శనివారం ఓ ప్రకటనలో వివరించింది. దీంతో అదనంగా 61.09 లక్షల మంది ఆహార భద్రత పరిధిలోకి వచ్చారు. కొత్తవి మంజూరుతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.05 కోట్లకు చేరగా, 3.42 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత లభించనుందని తెలిపింది. రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచి, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సురక్షితమైన, ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం సిద్ధం చేసింది. జిల్లాల్లో వాటి పంపిణీకి ప్రణాళిక, సమన్వయం బాధ్యతను కలెక్టర్లకు అప్పగించింది. జిల్లాల వారీగా లబ్ధిదారుల జాబితాలను ఖరారు చేసి, పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించింది. కార్డుల పంపిణీ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలని సూచించింది. కార్డుల కోసం వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించింది. జిల్లాల్లో పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. దీన్ని ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమంగా చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

# గాడి తప్పితే ఉపేక్షించం!

**వైసీపీ దీక్షల్లో ఒక్కరైనా విద్యార్థి ఉన్నారా?**


**వారిపై మెగా డీఎస్సీ ఉపాధ్యాయులే తిరగబడుతున్నారు**

**మంచి చేస్తే జనం సహకరిస్తారనేందుకు భోగాపురం,**

**ప్రజలే కుట్రలను ఛేదిస్తారనేందుకు కర్నూలు నిరసనలే సాక్ష్యం**

**ఈ నెలలోనే వెలిగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రారంభం**


**టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో సీఎం చంద్రబాబు**



**అమరావతి, ఆగస్టు 8** రాష్ట్రంలో గొడ్డలి పార్టీ గాడి తప్పుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "చట్టానికి లోబడి ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు, ఆందోళనలు చేసుకునే హక్కు అందరికీ ఉంది. కానీ, చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే మాత్రం ఉపేక్షించబోం. ప్రజల్ని ఇబ్బంది పెట్టేలా బస్టాండ్‌లు, రహదారుల వెంబడి నిరసనలు చేస్తామంటే చూస్తూ ఊరుకోం" అని హెచ్చరించారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన చంద్రబాబు, మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. మెగా డీఎస్సీపై గొడ్డలి పార్టీ నిర్వహిస్తున్న నిరసనలు శ్రుతి తప్పుతున్నాయన్నారు. రౌడీలు, గంజాయి బ్యాచ్ తప్ప ఒక్కరైనా డీఎస్సీ అభ్యర్థి ఆ నిరసనల్లో పాల్గొంటున్నారా అని ప్రశ్నించారు. కర్నూలులో శనివారం నిర్వహించిన డీఎస్సీ సంఘీభావ ర్యాలీలో డీఎస్సీకి ఎంపికై ఉపాధ్యాయులుగా చేస్తున్నవారు, డీఎస్సీ రాసిన వారే పాల్గొన్నారని తెలిపారు. గొడ్డలి పార్టీ చేసే నిరసనలు, దీక్షల వల్ల తమకు నష్టం కలుగుతుందన్న ఆందోళనతో వారంతా ఐక్యంగా తమ ఆత్మగౌరవం చాటారన్నారు. రాష్ట్రంలో రెండు ప్రధాన ప్రాజెక్టులను ఈ నెలాఖరులోగా ప్రారంభిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. వెలిగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తొలిదశకు (అనకాపల్లి వరకు) ఈ నెలలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. వాటితోపాటు అమరావతికి సంబంధించి రెండు కీలక ప్రారంభోత్సవాలు కూడా ఉన్నాయని తెలిపారు. సీడ్ యాక్సిస్ రహదారి ప్రారంభంతోపాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ కూడా ఈ నెలలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. వర్షాకాలంలోనూ అమరావతి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాల వల్ల రెండు రోజుల్లో శ్రీశైలం నిండే అవకాశం ఉందని, ఆ తర్వాత నాగార్జునసాగర్‌కూ నీరు రావచ్చునని సీఎం తెలిపారు. '

# యూపీఐ సేవలు ఉచితమే

- వ్యక్తుల మధ్య లావాదేవీలకు ఎలాంటి చార్జీలూ ఉండవు
- ఎండీఆర్ చార్జీలు కొన్నివ్యాపార లావాదేవీలకే..
- కేంద్ర ప్రభుత్వం స్పష్టత




**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** యూపీఐ లావాదేవీలు ఉచితంగానే చేసుకోవచ్చునని, వినియోగదారులు ఎలాంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. 'చెల్లింపు, పరిష్కార వ్యవస్థల చట్టం 2007'కు సవరణలు చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లును గురువారం లోక్‌సభ ఆమోదించింది. ఈ సవరణ బిల్లు వల్ల భవిష్యత్తులో యూపీఐ వాణిజ్య లావాదేవీలపై 'మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)' చార్జీలను విధించేందుకు కేంద్రానికి అధికారం ఉంటుంది. దీంతో యూపీఐ లావాదేవీలపై ఇక నుంచి చార్జీలు వసూలు చేస్తారనే భయం ప్రజల్లో ఏర్పడింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. వినియోగదారులు చేసే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ట్రాన్సాక్షన్ చార్జీలు వసూలు చేయమని స్పష్టం చేసింది. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలు ఎప్పట్లాగే ఉచితంగానే, ఎలాంటి రుసుములు లేకుండా కొనసాగుతాయని వివరించింది. ఇక, భవిష్యత్తులో ఎండీఆర్ చార్జీలు అమలులోకి వస్తే నిర్దేశిత పరిమితుల ప్రకారం ఎంపిక చేసిన వర్తకులు జరిపే లావాదేవీలపైనే చార్జీల వసూలు ఉంటుందని కేంద్రం తెలిపింది. ఆ చార్జీలు కూడా డెబిట్, క్రెడిట్ కార్డుల లావాదేవీలపై వసూలు చేస్తున్న నామమాత్రపు చార్జీల కంటే తక్కువగానే ఉంటాయని పేర్కొంది. అత్యధిక శాతం వ్యాపారులు, వర్తకులకు కూడా యూపీఐ సేవలు ఉచితంగానే లభిస్తాయని తెలిపింది. వ్యాపారులందరి నుంచి ఏకపక్షంగా ఎండీఆర్ వసూలు చేయడం ఉండదని స్పష్టం చేసింది. 'చెల్లింపు, పరిష్కార వ్యవస్థల చట్టం 2007'కు సవరణ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందిన తర్వాత ఎన్‌పీసీఐ నేతృత్వంలోని "యూపీఐ, సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ" ఎండీఆర్‌పై నిర్ణయం తీసుకుంటుందని కేంద్రం వెల్లడించింది. యూపీఐ లావాదేవీలపై చార్జీల వసూలు అంశంపై ఫోన్‌పే సంస్థ కీలక ప్రకటన చేసింది. యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితమనేని ప్రకటించింది.

# నేడు నర్సంపేటకు కేసీఆర్

**దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**

**కుటుంబాన్ని పరామర్శించనున్న మాజీ సీఎం**



**నర్సంపేట,ఆగస్టు 8:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నల్లబెల్లికి రానున్నారు. ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళు లర్పించి అనంతరం పార్టీ అండగా ఉంటుందని ఆయన కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వనున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలవనుంది.

**మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిపై**

# నాన్ బెయిలబుల్ వారెంట్

**వికారాబాద్, ఆగస్టు 8:**




బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిపై నాన్ బెయిలబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ) జారీ అయింది. ఓ చెక్ బౌన్స్‌లో దోషిగా తేలిన ఆయన.. కోర్టు తీర్పు వెలువరించే సమయంలో గైర్హాజరయ్యారు. దీంతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ కోర్టు ఎన్‌బీడబ్ల్యూ జారీ చేసింది. మెసర్స్ ఇంటెల్లిడెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రోహిత్‌రెడ్డి ఆ కంపెనీకి రూ.34.23 లక్షలు చెల్లించడానికి చెక్కు ఇచ్చారు. అయితే, సంబంధిత బ్యాంకు ఖాతాలో నిధులు లేకపోవడంతో ఆ చెక్కు మూడు సార్లు బౌన్స్ అయింది. దీంతో ఆ కంపెనీ బాధ్యులు రోహిత్‌రెడ్డికి లీగల్ నోటీసులు జారీ చేసినా ఆయన స్పందించలేదు. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ సదరు కంపెనీ బాధ్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే, ఈ కేసులో తన వాదనను నిరూపించుకోవడంలో రోహిత్‌రెడ్డి విఫలమయ్యారని వ్యాఖ్యానించిన కోర్టు ఆయనను దోషిగా ప్రకటించింది.

# నేడు గాంధారి మైసమ్మ జాతర

## వేలాది సంఖ్యలో హాజరు కానున్న భక్తులు

## పోలీసుల భారీ బందోబస్తు





**రామకృష్ణాపూర్, ఆగస్టు 8, (మన సమాజం):**
మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట జాతీయ రహదారి పక్కనగల గాంధారి మైసమ్మ ఆలయంలో ఆషాడ మాస బోనాల జాతరను నేడు వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రతి ఏటా ఆషాడ మాస చివరి ఆదివారం రోజున గత 25 సంవత్సరాలుగా సాంప్రదాయ పద్ధతిలో బోనాల జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆలయ సమీపంలోని పాలవాగు ఒడ్డు నుండి కమిటీ ఆధ్వర్యంలో మహిళ భక్తులు డప్పు చప్పుల్ల నడుమ బోనాలను నెత్తిన ఎత్తుకొని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలోని అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. నేడు ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జాతర జరుగుతుందని కమిటీ అధ్యక్షులు జక్కుల సమ్మయ్య తెలిపారు. అలాగే అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. వేలాది మందిగా భక్తుల తరలి వచ్చే అవకాశం ఉన్నందున వాహనాల పార్కింగ్ కొరకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక స్థలాన్ని కేటాయించింది. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు వనభోజనాలను చేసుకోవడానికి ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో గాంధారి వనంలో ప్రత్యేకంగా సౌకర్యాలను కల్పించారు. పోలీస్ శాఖ, అటవీశాఖ, మున్సిపల్ శాఖ అధికారులు సంయుక్తంగా జాతరకు అన్ని విధాలుగా సహకరిస్తున్నారని కమిటీ నిర్వాహకులు తెలిపారు. జాతర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ నేతృత్వంలో మందమర్రి సిఐ పర్స రమేష్ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పట్టణ ఎస్ఐ జాడీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 200 మంది సిబ్బందితో డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో జాతర నిర్వహణ జరుగుతుందని తెలిపారు. జాతరకు భక్తులు అన్ని విధాల సహకరించాలని పోలీస్ అధికారులు ప్రత్యేకంగా కోరారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వం



**రామకృష్ణాపూర్, ఆగస్టు 8, (మన సమాజం):**
దేశంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని రామకృష్ణాపూర్ సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. దేశాన్ని కార్పోరేట్లకు తాకట్టు పెడుతున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన పాదయాత్రలో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీలో నాయకులతో కలిసి జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పర్యటించి మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలను కలిపిస్తూ సామాన్య ప్రజలపై మోడీ ప్రభుత్వం భారాన్ని మోపుతుందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణం చేస్తూ ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు దాదాదత్తం చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో పేద, మధ్యతరహ, సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపేద ప్రజలకు సిపిఐ పార్టీ ఎల్లప్పుడు అండగా నిలుస్తూ వారి హక్కుల కొరకు నిరంతరం ప్రభుత్వంపై పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఉప్పకాయల లింగయ్య, మిట్టపల్లి పౌల్, సత్యం, సాంబయ్య, మొండి, గోపి, వెంకటస్వామి, సాంబయ్య, వెంకన్న, దుర్గారాజ్, రాజేశం, వీరయ్య, పాల్గొన్నారు.

# షుగర్ ఉన్నవారు

# ఈ మిల్లెట్లను తీసుకోవాలి..

## ఎంతో మేలు జరుగుతుంది..!



మధుమేహ వ్యాధి గ్రస్తులు ఆహారం తీసుకునే విషయంలో ప్రతిరోజూ ఒక సవాల్ ను ఎదుర్కొంటారని చెప్పవచ్చు. ఎందుకంటే వీరు తీసుకునే ఆహారం తక్షణమే రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది, అనారోగ్యానికి కూడా దారి తీస్తుంది. కనుక ఆహార విషయంలో మధుమేహ వ్యాధి గ్రస్తులు చాలా జాగ్రత్తగా ఉండాలి. చాలా మంది చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి చపాతీలను తీసుకుంటూ ఉంటారు. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని ఇవే సరైన ఆహారం అని నమ్ముతారు. అయితే ఇవే కాకుండా మిల్లెట్స్ తో చేసిన ఆహారాలను తీసుకోవడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. చిరుధాన్యాలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగకుండా ఉంటాయి. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక నెమ్మదిగా జీర్ణమవుతాయి. దీంతో ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరగడంతో పాటు స్థిరమైన శక్తి విడుదల అవుతుంది.

**సామలు..**
మిల్లెట్స్ అన్నీ మేలు చేసేవే అయినప్పటికీ సజ్జలు, సామలు, కొర్రలు అనే ఈ మూడు రకాల మిల్లెట్స్ మరింత మేలు చేస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. ఈ మిల్లెట్స్ లో ఫైబర్ తో పాటు పోషకాలు, యాంటీ ఆక్సీడెంట్లు కూడా ఉంటాయని వీటిని తీసుకోవడం వల్ల మధుమేహ వ్యాధి గ్రస్తులకు ఎంతో మేలు కలుగుతుందని వారు సూచిస్తున్నారు. సామలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. రక్తంలో గ్లూకోజ్ ను నెమ్మదిగా విడుదల చేయడంలో ఇవి సహాయపడతాయి. దీంతో రక్తంలో చక్కెర పెరుగుదల నివారించబడుతుంది. వీటిలో ఉండే అధిక ఫైబర్ గ్లూకోజ్ ను నియంత్రించడంతో పాటు ఇన్సులిన్ సెన్సిటివిటీని కూడా పెంచుతుంది. సామల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి మొత్తం శరీరానికి మేలు చేస్తాయి. వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక జీర్ణశక్తి కూడా మెరుగుపడుతుంది. మలబద్దకం వంటి సమస్యలు తగ్గుతాయి.

**కొర్రలు..**
కొర్రలు వాటి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కు, ఫైబర్ కు ప్రసిద్ధి చెందాయని చెప్పవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. వీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. కనుక కొర్రలను తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. మంచి బ్యాక్టీరియాను పెంపొందించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా కొర్రలు మనకు సహాయపడతాయి.

**సజ్జలు..**
సజ్జల్లో మెగ్నీషియం, ఐరన్, క్యాల్షియం వంటి ఖనిజాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా తయారవుతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇవి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అలాగే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తగ్గుతాయి. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో బరువు అదుపులో ఉంటుంది. డయాబెటిస్ తో బాధపడే వారు ఈ మూడు రకాల మిల్లెట్స్ ను ఆహారంగా తీసుకోవడం వల్ల చక్కెర స్థాయిలు ఎల్లప్పుడూ అదుపులో ఉంటాయి. శరీర మొత్తం ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. వీటితో తరచూ పాన్‌కేక్స్, కిచిడీ, పొంగల్, ఉప్మా, దోశ, ఇడ్లీ వంటి వాటిని కూడా తయారు చేసి తీసుకోవడం వల్ల రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.


# బత్తుల మల్లన్న కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**రాయికల్, ఆగష్టు 9**
హరితహారం స్ఫూర్తితో అటవీ ప్రాంత పరిరక్షణకు అంకితమైన వ్యక్తి బత్తుల మల్లన్న తెలంగాణ ఉద్యమకారుడు మల్లన్న మాజీ ముఖ్యమంత్రి ప్రారంభించిన హరితహారం కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని, పర్యావరణ పరిరక్షణతో పాటు అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు మల్లన్న చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.హరితహారం స్ఫూర్తితో చెట్లు అటవీ ప్రాంతంలో ఉన్న వృక్ష సంపదను సంరక్షించేందుకు ఆయన నిరంతరం కృషి చేశారు.అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేతను అరికట్టడంతో పాటు, కొత్త మొక్కలను నాటడం, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం, ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు స్థానికులను భాగస్వాములను చేయడం వంటి కార్యక్రమాలను చాలా చేశారు అలాంటి బత్తుల మల్లన్న మరణం చాలా బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చేర్మెన్ రవి నాయకులు గోపి రాజిరెడ్డి, బర్కం మల్లేష్, మైపాల్, శ్రీధర్ రెడ్డి, హరీష్ రావు,సుధీర్, రవి,బొమ్మేన తిరుపతి, రొండి గంగారాం, దుంపేట బుచ్చన్న , వాని ముజహీద్, కొత్తూరి రాకేష్ , వీస అంజాద్,మహేష్,రవి,నందు నాయక్ బుజ్జిఅక్క తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఈ అలవాట్లు మీకు ఉన్నాయా..

## అయితే మీ కిడ్నీల ఆరోగ్యం దెబ్బ తింటుంది జాగ్రత్త..!



మనం తీసుకునే ఆహారంపైనే మన శరీర ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకున్నప్పుడే శరీరంలోని అవయవాలతో సహా మొత్తం శరీరానికి మేలు కలుగుతుంది. అనారోగ్యకరమైన ఆహారం శరీరంలోని అవయవాలకు హానిని కలిగిస్తుంది. మనం తీసుకునే ఆహారం మూత్రపిండాల ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేసి అందులో ఉండే విష పదార్థాలను బటయకు పంపిస్తాయి. మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటే మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. మనం తీసుకునే ఆహారాలు కొన్ని మూత్రపిండాలపై ఒత్తిడిని కలిగించడంతో పాటు మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల మూత్రపిండాల సమస్యలు తలెత్తుతాయి. మూత్రపిండాల ఆరోగ్యానికి హానిని కలిగించే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**జంక్ ఫుడ్స్, ప్రాసెస్డ్ ఫుడ్స్..**
జంక్‌ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. వీటిలో ఉప్పుతో పాటు ప్రిజర్వేటివ్స్ ఉంటాయి. ఇవి మూత్రపిండాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఫ్రెంచ్ ఫ్రైస్, ప్యాక్ చేసిన ఆహారాలు, పిజ్జా వంటివి మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వైద్యులు చెబుతున్నారు. అలాగే మాంసంలో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రోటీన్ మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచుతుంది. మాంసాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాల పనితీరు తగ్గుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా తయారవుతుంది. ఇది మూత్రపిండాల వైఫల్యానికి దారి తీస్తుంది. కనుక మాంసాన్ని కూడా తక్కువగా తీసుకోవాలి. అదే విధంగా చక్కెర పానీయాలు, తీపి ఆహారాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటుంది. తీపి పదార్థాలు రక్తంలో చక్కెరను పెంచుతాయి. రక్తంలో ఎక్కువగా ఉండే చక్కెర స్థాయిలు మూత్రపిండాలకు హానిని కలిగిస్తాయి.

**పండ్లు, కూరగాయలు..**
వీటితో పాటు మనలో చాలా మంది సాసేజ్‌లు, బేకన్, ప్యాక్ చేసిన మాంసం, ప్రాసెస్ చేసిన, డీప్ ఫ్రై ఆహారాలను ఎక్కువగా తీసుకుంటున్నారు. ఇవి మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు బీపీ, ఊబకాయం వంటి ఇతర అనారోగ్య సమస్యలకు కూడా కారణమవుతాయి. ఇవన్నీకూడా మూత్రపిండాల ఆరోగ్యానికి హానికరం. కనుక ఈ ఆహారాలను తీసుకోవడం చాలా వరకు తగ్గించాలని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారాలకు బదులుగా మూత్రపిండాలకు మేలు చేసే ఆహారాలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పండ్లు, కూరగాయలు వంటి వాటిని తీసుకోవాలి. సమతుల్యమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకునే ప్రయత్నం చేయాలి. రోజూ 8 నుండి 10 గ్లాసుల నీటిని తాగాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి. రక్తపోటు, డయాబెటిస్ వంటి వ్యాధులు అదుపులో ఉండేలా జాగ్రత్త వహించాలి. దీని వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడకుండా ఉంటుంది. మూత్రపిండాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ విధంగా సరైన ఆహారం, తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, మూత్రపిండాలకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై బీజేపీ దృష్టి

**అర్హులైన ఓటర్ల నమోదుకు పిలుపు**

**అక్రమ నమోదులపై అప్రమత్తంగా ఉండాలని సూచన**

**హైదరాబాద్‌లో ఎస్ఐఆర్ వర్క్‌షాప్ నిర్వహణ**





**హైదరాబాద్, ఆగస్టు 8:**
రాష్ట్రంలో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) రెండో విడత ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు మరింత అప్రమత్తంగా పనిచేయాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ వర్క్‌షాప్‌లో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బీజేపీ కార్యకర్తలు అహర్నిశలు శ్రమిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేస్తున్నారని రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి సరైన ఓటరు జాబితా అత్యంత కీలకమని అన్నారు. తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమ వ్యక్తులకు వెనుకద్వార మార్గం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ల జారీ అనేక అనుమానాలకు తావిస్తోందని రామచందర్ రావు పేర్కొన్నారు. అక్రమ వ్యక్తులకు చట్టబద్ధత కల్పించే ప్రయత్నంగా ఇది కనిపిస్తోందని ఆరోపించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయడంతో పాటు, అనుమానాస్పదమైన లేదా అనర్హమైన నమోదులను క్షుణ్ణంగా పరిశీలించాలని కార్యకర్తలకు సూచించారు. ఓటరు జాబితా స్వచ్ఛతను కాపాడేందుకు మరింత వేగంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కిషన్ రెడ్డి, రఘునందన్ రావు, గోడం నగేశ్‌తో పాటు బీజేపీ తెలంగాణకు చెందిన పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.

# యూఏఈ బతుకమ్మ వేడుకలకు కేటీఆర్ కు ఆహ్వానం

**- గల్ఫ్ కార్మికుల సమస్యలపై చర్చ - ప్రవాస తెలంగాణ సంఘం ఆహ్వాన పత్రం**





**హైదరాబాద్, ఆగస్టు 8:**
యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆహ్వానించారు. నందినగర్‌లోని ఆయన నివాసంలో కలిసిన ప్రతినిధులు అక్టోబర్ 11న దుబాయ్‌లో జరగనున్న వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఉత్సవాల పోస్టర్‌ను కేటీఆర్ ఆవిష్కరించారు. యూఏఈలో గత 16 సంవత్సరాలుగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని సంఘం ప్రతినిధులు తెలిపారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ వేదికపై చాటిచెప్పే లక్ష్యంతో ప్రతి ఏడాది వేలాది మంది ప్రవాస తెలంగాణ వాసుల సమక్షంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈసారి దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్‌లో కార్యక్రమాన్ని మరింత వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈటీసీఏ ప్రతినిధులతో సమావేశమైన కేటీఆర్ గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికుల పరిస్థితులపై ఆరా తీశారు. ఉపాధి అవకాశాలు, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణవారికి అవసరమైన సహకారం అందించే విషయంలో సంఘాలు చేస్తున్న కృషిని అభినందించారు. తెలంగాణకు దూరంగా ఉన్నప్పటికీ తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ వంటి పండుగలను నిర్వహించడం అభినందనీయమని కేటీఆర్ అన్నారు. ప్రవాస తెలంగాణ సంఘాలు ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ గుర్తింపును మరింత విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం కూడా ప్రశంసనీయమన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ఈటీసీఏ చేస్తున్న సేవలను కేటీఆర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ కార్మికులకు అండగా నిలుస్తూ సహాయ సహకారాలు అందించడం గొప్ప విషయమని అన్నారు. భవిష్యత్తులో కూడా గల్ఫ్ దేశాల్లోని తెలంగాణవారికి అవసరమైనప్పుడు తమ సహకారం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. అక్టోబర్ 11న దుబాయ్‌లో జరగనున్న బతుకమ్మ సంబరాలకు పెద్ద సంఖ్యలో ప్రవాస తెలంగాణవాసులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననుండగా, తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రవాస తెలంగాణ సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే మహోత్సవంగా ఈ వేడుకలు నిలవనున్నాయి.

# హైడ్రా పోస్టుల కోసం వేలాది మంది పోటీ

**డీఆర్ఎఫ్ అసిస్టెంట్ పోస్టులకు భారీ స్పందన**

**సరూర్‌నగర్ స్టేడియంలో వేలాది మంది అభ్యర్థులు**

**పోలీసుల సహకారంతో సజావుగా ఎంపికలు**

**అందరికీ అవకాశం కల్పిస్తామని హామీ**



**హైదరాబాద్, ఆగస్టు 8:**
హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) అసిస్టెంట్, డ్రైవర్ ఉద్యోగాల నియామక ప్రక్రియకు యువత నుంచి విశేష స్పందన లభించింది. 100 మంది డీఆర్ఎఫ్ అసిస్టెంట్లు, 50 మంది డ్రైవర్ల నియామకానికి సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన ఎంపికల కోసం వేలాది మంది అభ్యర్థులు హాజరుకావడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. హైడ్రా అధికారులు ఇప్పటికే ఆగస్టు 8, 9 తేదీల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు ప్రకటించడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మూడు వేల మందికి పైగా అభ్యర్థులు ఒకేసారి చేరుకోవడంతో దరఖాస్తుల స్వీకరణ, టోకెన్ల పంపిణీ, శారీరక పరీక్షల నిర్వహణలో ప్రారంభ దశలో కొంత ఇబ్బంది తలెత్తింది. అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ఒకేసారి ముందుకు రావడంతో పరిస్థితిని నియంత్రించేందుకు అధికారులు, పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ఈ క్రమంలో ఒక అధికారి అసహనానికి గురై పరుష వ్యాఖ్యలు చేసిన ఘటన చోటుచేసుకున్నప్పటికీ అనంతరం పరిస్థితిని వివరించి అభ్యర్థులను సముదాయించారు. యువత కూడా పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎంపికల ప్రక్రియ కొనసాగింది. తొక్కిసలాటలకు ఆస్కారం లేకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వరుసల వారీగా దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. శారీరక పరీక్షలకు హాజరయ్యే ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పిస్తామని అధికారులు పదేపదే లౌడ్‌స్పీకర్ల ద్వారా ప్రకటించారు. దరఖాస్తుదారులందరి వివరాలను నమోదు చేసి టోకెన్లు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. నియామకాలపై యువతలో ఉన్న ఆసక్తి కారణంగా భారీ సంఖ్యలో అభ్యర్థులు తరలివచ్చారని అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం పోటీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విభాగాల్లో వెలువడుతున్న ప్రతి నియామక ప్రకటనకు విశేష స్పందన కనిపిస్తోందన్నారు. యువత సహకారం, పోలీసుల సమన్వయం వల్ల ఎంపికల ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని హైడ్రా అధికారులు తెలిపారు. మిగిలిన పరీక్షలను కూడా పారదర్శకంగా నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. హైడ్రా విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భారీ స్పందన

**7,340 ఫ్లాట్లకు 35 వేలకుపైగా దరఖాస్తులు**

**ఇంకా రెండు రోజులే గడువు**


**ఆగస్టు 20 తర్వాత లాటరీ ప్రక్రియ**



**హైదరాబాద్, ఆగస్టు 8:**
హైదరాబాద్ మహానగర పరిధిలో పేద, అల్పాదాయ వర్గాల కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ పథకం కింద నిర్మించనున్న 7,340 ఫ్లాట్ల కోసం ఇప్పటివరకు 35,125 దరఖాస్తులు అందినట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 10 వరకు మాత్రమే గడువు ఉండటంతో అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష ఇళ్ల నిర్మాణ లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 500 చొప్పున ఫ్లాట్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోనే ఈ గృహ సముదాయాలను నిర్మించడం ద్వారా పేదలకు నగర ప్రాంతాల్లోనే సొంత నివాసం కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో రూ.30 లక్షల నుంచి రూ.58 లక్షల వరకు విలువ చేసే ఫ్లాట్లను కేవలం రూ.6 లక్షలకే అందిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు పేర్కొంది. పేద కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు సొంత ఇంటి కలను తక్కువ వ్యయంతో నెరవేర్చాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు వివరించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇంత పెద్ద స్థాయిలో నగర ప్రాంతాల్లో పేదల కోసం ప్రత్యేక గృహ నిర్మాణ పథకం చేపట్టడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు. ఈ పథకంలో దరఖాస్తు చేసుకునే సమయంలో కుల, ఆదాయ ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని గౌతం స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో చెల్లించే రూ.10 వేల ధరావతు రుసుమును ఇల్లు కేటాయించని పక్షంలో పూర్తిగా తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా లబ్ధిదారులకు ఫ్లాట్లపై పూర్తి రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు.దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యాక ఆగస్టు 20 తర్వాత లాటరీ విధానం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇదే సమయంలో నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను కూడా వేగవంతం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. లాటరీ పూర్తయిన వెంటనే నిర్మాణాలు ప్రారంభించి, ఏడాది వ్యవధిలోనే అన్ని ఫ్లాట్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా కూకట్‌పల్లి 5,233 దరఖాస్తులతో అగ్రస్థానంలో నిలవగా, ఖైరతాబాద్‌లో 4,394, కుత్బుల్లాపూర్‌లో 4,121, నాంపల్లిలో 3,613, మలక్‌పేటలో 2,846, శేరిలింగంపల్లిలో 2,530 దరఖాస్తులు వచ్చాయి. ఇతర నియోజకవర్గాల్లో కూడా గణనీయమైన స్పందన కనిపిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పథకానికి సంబంధించిన వివరాలు, సందేహాల నివృత్తి కోసం హౌసింగ్ బోర్డు ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌ను సంప్రదించాలని వైస్ చైర్మన్ సూచించారు.

## యూఎస్ తన పద్ధతిని మార్చుకోనంత వరకూ హోర్ముజ్ తెరుచుకోదు: ఇరాన్

**ఇరాన్, ఆగస్టు 8 :**



యూఎస్ తన పద్ధతిని మార్చుకోనంత వరకూ హోర్ముజ్ జలసంధి తెరుచుకోదని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ తాజాగా స్పష్టం చేసింది. ఇరాన్ ప్రభుత్వ మీడియా ఈ ప్రకటనను ప్రచురించింది. యూఎస్ ఇక ఎన్నడూ ఇరాన్‌పై బెదిరింపులకు దిగొద్దని సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ స్పష్టం చేసింది. నావికా దిగ్బంధనాన్ని తొలగించాలని, సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. అంతేకాకుండా, యుద్ధం వల్ల ఇరాన్‌కు జరిగిన నష్టాన్ని ఆర్థికంగా పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని పేర్కొంది. విదేశాల్లోని ఇరాన్ ఆస్తులపై ఆంక్షలను బేషరతుగా తొలగించాలని కూడా స్పష్టం చేసింది. ఈ పరిణామాలపై యూఎస్ ఇంకా స్పందించాల్సి ఉంది. హోర్ముజ్ తెరవడంపై డీల్ కుదిరాకే దిగ్బంధనం గురించి చర్చించాలని అమెరికా పట్టుపడుతోంది. జులైలో కుదిరిన మధ్యంతర డీల్ ప్రకారం, ఆంక్షల తొలగింపునకు షెడ్యూల్, యుద్ధ నష్ట పరిహారం వంటివాటిపై తుది డీల్‌లో భాగంగా చర్చిస్తారు. అంతేకాకుండా, విదేశాల్లోని ఇరాన్ నిధులపై ఆంక్షల తొలగింపు కూడా ఉంటుందని అమెరికా అప్పట్లో పేర్కొంది. ఈ చర్చలను ముగించేందుకు 60 గడువు విధించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. ఈ గడువు మరో వారంలో ముగియనుంది. డెడ్‌లైన్‌ను మరికొంతకాలం పొడిగించే అవకాశం ఉందని కూడా సమాచారం. మరోవైపు, హోర్ముజ్ నిర్వహణ కోసం ఒమాన్‌తో ప్రత్యేక డీల్ తుది దశకు చేరుకుందని ఇరాన్ తెలిపింది. హోర్ముజ్‌లో రవాణా మార్గంపై డీల్ త్వరలో కుదరవచ్చని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. ప్రస్తుతం గల్ఫ్‌లో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఒమాన్ మాత్రం ఈ పరిణామాలపై ఆచితూచి స్పందించింది. చర్చలు సానుకూలంగా, నిర్మాణాత్మకంగా సాగుతున్నాయని మాత్రం చెప్పింది. జలసంధిలో నౌకలపై దాడులను ఖండించింది.



## అతని వల్లే డ్యాన్స్‌లో
# పర్‌ఫెక్షన్!

ఇరవైఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో హిట్ చిత్రాల్లో భాగమైంది అగ్ర కథానాయిక తమన్నా. హీరోయిన్‌గా రాణిస్తూనే మరోవైపు ప్రత్యేక గీతాల ద్వారా యూత్‌లో క్రేజ్ దక్కించుకుంది. ఇటీవలకాలంలో 'స్త్రీ-2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్..' పాట బాగా పాపులర్ అయింది. తమన్నా నటించిన 'డూ యూ వాన్నా పార్ట్‌నర్' అనే వెబ్‌సిరీస్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో డ్యాన్స్‌లో తన ప్రతిభకు కారణం అల్లు అర్జున్ అని వెల్లడించింది. "బద్రీనాథ్' టైంలో డ్యాన్స్ విషయంలో బన్నీ బాగా ఎంకరేజ్ చేశారు. మంచి పర్‌ఫెక్షన్‌తో డ్యాన్స్ ఎలా చేయాలో అతని నుంచి నేర్చుకున్నా. ఆ సినిమా తర్వాత నాకు డ్యాన్స్ పరంగా చాలా ఆఫర్లొచ్చాయి. స్పెషల్ సాంగ్స్‌తో కూడా పాపులర్ అయ్యాను' అని చెప్పింది తమన్నా. ఈ ఏడాది 'ఓదెల-2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది తమన్నా. ప్రస్తుతం ఈ భామ హిందీలో నాలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



# నానికి జోడీగా?

'లెనిన్'తో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకున్నది పూణే వయ్యారి భాగ్యశ్రీ బోర్సే. దీంతో ఈ అందాలభామకు అద్భుతమైన అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్ అగ్ర హీరో శివకార్తికేయన్ సరసన 'సెయోన్' సినిమాలో నటిస్తూ భాగ్యశ్రీ బోర్సే బిజీగా ఉన్నది. తాజా సమాచారం ప్రకారం టాలీవుడ్ అగ్ర హీరో నాని హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'బ్లడీ రోమియో' చిత్రంలోనూ కథానాయికగా భాగ్యశ్రీ బోర్సే పేరునే పరిశీలిస్తున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. సంప్రదింపులు కూడా జరిగాయని, త్వరలోనే దీనిపై పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తున్నది. మలయాళ అగ్ర నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా ఈ సినిమాలో కీలక పాత్ర పోషించనున్నారు. అక్టోబర్ నుంచి చిత్రీకరణ మొదలు కానున్న ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

## రెండు వేలకు మించి
# ఖర్చుపెట్టను!

అరంగ్రేటం చేసిన అనతికాలంలోనే తెలుగులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం హిందీ,



తెలుగు భాషల్లో ఈ భామ భారీ చిత్రాల్లో నటిస్తున్నది. అల్లు అర్జున్-అట్లీ కాంబో చిత్రంలో ఈ సొగసరి ఓ కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలొస్తున్నా యి. వరుస భారీ సినిమాలతో ఆర్థికంగా కోరుకున్న స్థాయికి చేరుకున్నప్పటికీ..ఖర్చు విషయంలో మాత్రం పొదుపు పాటిస్తుందట ఈ అమ్మడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా డబ్బుపై నియంత్రణ ఉండాలంటూ మృణాల్ చెప్పిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. 'నాకు ఖరీదైన దుస్తులు కొనడం అస్సలు ఇష్టం ఉండదు. వాటి కోసం ఎంతో ఖర్చుపెడతాం. ఏదో ఒక సందర్భంలో ధరించడం తప్ప అవి ఎక్కువ సమయం బీరువాల్లోనే ఉండిపోతాయి. అందుకే దుస్తుల విషయంలో రెండుమూడు వేలకంటే ఎక్కువగా ఖర్చు చేయను. ఫిల్మ్ ఈవెంట్స్‌కు మాత్రం కాస్త ఖరీదైన డిజైనర్ క్లాత్స్ ధరిస్తాను. అయితే వాటిని అద్దెకు తెచ్చుకుంటాను. అంత డబ్బులు పెట్టి ఎప్పుడూ బట్టలు కొనను' అని చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్.

## అదే సక్సెస్ అనుకున్నా.. టార్గెట్ పెట్టుకున్నా.. కానీ

దాదాపు మూడేళ్లగా మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు సమంత చికిత్స తీసుకుంటూనే ఇటు సినిమాలు, అటు ప్రొడక్షన్ హౌస్ పనులు చూసుకుంటోంది. అయితే మయోసైటిస్‌తో పోరాటం తనకెన్నో విషయాలు నేర్పిందని చెబుతున్నారామె. ఒకప్పటితో కంపేర్ చేస్తే ఇప్పుడు ఎన్నో విషయాల్లో తనలో మార్పు వచ్చిందన్నారు సామ్. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మయోసైటిస్ వల్ల జీవితంలో దేనికి ఇంపార్టెన్ ఇవ్వాలో అర్థమైంది. దానితో చేసిన ఆ పోరాటం నన్ను ఎంతగానో మార్చేసింది. గతంలో విజయం అంటే గ్యాప్ లేకుండా సినిమాలు చేయడం అనుకునేదాన్ని. ఏడాదిలో నేను నటించిన ఐదు సినిమాలు విడుదలైన సందర్భాలున్నాయి. అదే సక్సెస్ అని నమ్మి మురిసిపోయేదాన్ని. వరుసగా సినిమాలు చేయాలి, పెద్ద బ్లాక్‌బస్టర్స్‌లో నటించాలి. టాప్ 10 నటీనటుల లిస్ట్‌లో ఉండాలి అని భావించేదాన్ని. బుర్రలో ఎప్పుడూ అదే ఆలోచన. కానీ ఇప్పుడు నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. వివరం తెలిసింది. రెండేళ్లుగా నా సినిమాలు విడుదల కాలేదు, టాప్ 10 లిస్ట్‌లోనూ లేను. అలాగే నా దగ్గర రూ.1000 కోట్ల సినిమాలు అంతకన్నా లేవు. అయినా నేను ఇప్పుడు ఉన్నంతలో సంతోషంగానే ఉన్నా' అని అన్నారు. 'ఖుషి' చిత్రం తర్వాత సమంత మరో చిత్రానికి సైన్ చేయలేదు. తన సొంత బ్యానర్‌లో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌లో వచ్చిన 'శుభం' చిత్రంలో గెస్ట్ రోల్ చేశారు. ప్రస్తుతం తన సొంత బ్యానర్‌లోనే 'మా ఇంటి బంగారం' చిత్రం మాత్రమే తన చేతిలో ఉంది. ఆ సినిమా షూటింగ్ అప్‌డేట్ ఏమీ లేదు.

